https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక


తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 AM TO 10 AM

సంపుటి: 01 / సంచిక:26 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / శుక్రవారం, సెప్టెంబర్ 11,2026



### రిపబ్లికన్లను గెలిపిస్తే ఒక్కొక్కరికి 4.75 లక్షలు..

## అమెరికా వయోజనులకు ట్రంప్ ఉచిత హామీ

**వాషింగ్టన్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత రాజకీయాలను అనుసరిస్తున్నట్టు కనిపిస్తున్నది. ఇరాన్ యుద్ధంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న ట్రంప్ ..మధ్యంతర ఎన్నికల ముంగిట ప్రజలకు 'ఉచిత హామీలు' ప్రకటించారు. ప్రతినిధుల సభ, సెనేట్‌లకు నవంబర్‌లో జరిగే ఉప ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థులను గెలిపిస్తే అమెరికాలోని వయోజన పౌరులందరికీ 5,000 డాలర్ల(రూ.4.76 లక్షలు) డివిడెండ్‌ను అందచేస్తానని ట్రంప్ బుధవారం వాగ్దానం చేశారు. ఈ ఎన్నికల్లో తానే పోటీ చేస్తున్నట్టుగా భావించి రిపబ్లికన్లకు ఓటు వేయాలని డాలస్‌లో జరిగిన ఓ సదస్సులో ఆయన తన మద్దతుదారులను కోరారు. మనం చాలా బాగా రాణించాం. మన దేశం చాలా డబ్బు సంపాదిస్తున్నది.కాబట్టే ఈ చెల్లింపు చేస్తున్నాం అని ట్రంప్ చెప్పారు.

02

# బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీకి పుతిన్..

## నేడు ప్రధాని మోదీతో కీలక భేటీ..



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. పుతిన్ బ్రిక్స్ బిజినెస్ ఫోరం సమావేశంలో ప్రసంగించడానికి ముందు ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు పుతిన్ రాకతో భారత్-రష్యా సంబంధాల్లో మరో కీలక ఘట్టానికి తెరలేచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఇంధనం, రక్షణ, పెట్టుబడులు, రవాణా తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. అలాగే అంతర్జాతీయ పరిణామాలు, ప్రాంతీయ భద్రత, ఉక్రెయిన్-రష్యా యుద్ధం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలతో పాటు ద్వైపాక్షిక సహకారంపై ఇరువురూ చర్చించే అవకాశం ఉంది ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా కూడా మోదీ, పుతిన్ సమావేశమయ్యారు. కాగా, బ్రిక్స్ సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు పలు ఇతర దేశాల నేతలతో కూడా సమావేశం కానున్నారు . దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, మలేషియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్-సిసిలతో సహా ఇతర అంతర్జాతీయ నాయకులతో కూడా సమావేశాలు నిర్వహించనున్నారు.




## సంధ్యారావు ఎవరో తేల్చండి..

### సైబర్ క్రైమ్‌లో ఆర్ఎస్పీ ఫిర్యాదు!

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11:**

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి చూపించిన 'సంధ్యారావు' అనే ఎక్స్ అకౌంట్‌ను ఎవరు నిర్వహిస్తున్నారో పోలీసులే తేల్చాలని బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ (సీసీఎస్)లో ఆయన గురువారం చేశారు. ఏఛీఖఅనహ్త్రఝుత్తీఖశీదీ=ూ అనే ఎక్స్ అకౌంట్ ద్వారా బీఆర్ఎస్ పార్టీలో ఎలాంటి ఉనికిలో లేని 'ఇంటర్నేషనల్ సెక్రటరీ' అనే నకిలీ హోదాను వాడుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

02



## ఇందిరమ్మ ఇండ్లకు రూ.5లక్షలు సరిపోవట్లే..

### అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి!

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందజేస్తున్న ఆర్థిక సాయం రూ.5 లక్షలు సరిపోవడం లేదని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో గురువారం 'ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర ప్రభుత్వ నిధులు' అంశంపై ప్రశ్నోత్తరాల చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్మాణ కార్మికుల సమస్య ఉందని, ఇంటి నిర్మాణానికి మేస్త్రీలు, లేబర్ చార్జీలు కలిపి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అవుతున్నదని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు ఏ మాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.ఇంటి నిర్మాణ సామగ్రి, ఇసుక, ఐరన్ ధర పెరుగడంతో రూ.6 లక్షల్లో పూర్తయ్యే ఇంటి నిర్మాణ వ్యయం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు చేరిందని వివరించారు.

02



## రష్యా సహకారంతో దేశంలోనే విమాన తయారీ

### చర్చలను విస్తృతం చేశాం: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**న్యూఢిల్లీట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

భారత్‌లో విమాన తయారీ దిశగా రష్యాతో చర్చలను విస్తృతం చేసినట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. రష్యా ప్రతినిధి బృందంతో భేటీ అనంతరం గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. "దేశంలో విమాన తయారీపై రష్యాతో ప్రభుత్వరంగ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకోవడం తెలిసిందే. టర్బోప్రాప్ ఐఎల్-114, సుఖోయ్ సూపర్‌జెట్ -100 విమానాలు. భారత్‌లో ప్రాంతీయ అనుంసధానత పథకానికి చక్కగా సరిపోతాయి. ఎన్నో ప్రాంతీయ విమానాశ్రయాలు ఏర్పాటు కానున్నాయి. వాటిని అనుసంధానించడం ఎంతో ముఖ్యం. సాధ్యమైనంత త్వరగా దేశంలోనే ఈ విమానాలను తయారు చేయడంపై దృష్టి సారించాం"అని ప్రకటించారు.

02

# ముగ్గురు మంత్రులపై 'ప్రత్యేక' నిఘా..

## 'సంక్షేమ' మంత్రులపై ఇంటెలిజెన్స్ నజర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ):**

**క్యాబినెట్‌లోని మరో ముగ్గురు మంత్రులు 'ప్రత్యేక నిఘా' నీడలోకి వెళ్లారా? వారిపై నిఘావర్గాలు డేగకన్ను వేశాయా? టెండర్లు, ప్రమోషన్లు, బదిలీలు, నియామకాలు.. ఇలా వారి శాఖల్లో జరుగుతున్న అన్నీ కార్యకలాపాల సమాచారాన్ని గుట్టుగా సేకరిస్తున్నయా? సమగ్ర వివరాలతో వెంటనే సీఎంవోకు ప్రత్యేక నివేదికలు సమర్పిస్తున్నయా? ప్రస్తుతం సచివాలయంలో పెద్దఎత్తున జరుగుతున్న చర్చ ఇది. దీనికి అధికార వర్గాలు 'అవును' అనే సమాధానం ఇస్తున్నాయి. ఇందులో ఏకంగా ఒక మంత్రి సీటుకు ఎసరు పెట్టారని ప్రచారం జరుగుతున్నది. మరి ఆ ముగ్గురిపై ఇంతలా నిఘా పెట్టడానికి కారణమేమిటని ఆరా తీయగా, తమ శాఖల్లో అంశాలపై వారు వివరణ కోరడమేనని తెలిసింది. ముఖ్యంగా గురుకుల టెండర్ల వ్యవహారంపై ప్రశ్నించడంతో ఇద్దరు 'సంక్షేమ' మంత్రులపై 'ముఖ్యనేత' గుర్రుగా ఉన్నట్టు సమాచారం.నగర పర్యటనలను అన్వేషించండి**



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

**గురుకుల టెండర్లతో మొదలు**

రాష్టంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాలతోపాటు సంక్షేమ హాస్టళ్లు, క స్తూర్బా విద్యాలయాలు, గిరిజన ఆశ్రమ, మోడల్, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అక్కడి విద్యార్థులకు ఏటా ప్రభుత్వం పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీ, దుప్పట్లు, బూట్లు, సా క్సులు మొత్తంగా 24రకాల వస్తువులు అందిస్తున్నది. గతంలో జిల్లా స్థాయిలో కలెక్టర్ల ద్వారా టెండర్లు పిలిచి, ఆయా విద్యాసంస్థలు సొంతంగా వాటిని కొనుగోలు చేసేవి. కాంగ్రె స్ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ నేతృత్వంలో అన్నీ గు రుకుల సొసైటీల కార్యదర్శులతో ప్రత్యేకంగా ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్(పీఎంయూ) ను ఏర్పాటు చేసింది.విద్యార్థులకు సంబంధించిన వస్తువులు, నిత్యావసర వస్తువుల సరఫరా, సేకరణ, ధరల ఖరారు, టెండర్ ప్రక్రియను వారికి అప్పగించింది. ఇప్పటివరకు నిర్వహించిన రూ.1,200 కోట్ల వర్క్ ఆర్డర్‌లో రూ.1,100 కోట్ల వరకు గుజరాత్ కంపెనీలకే కట్టబెట్టింది. ఇటీవల సుమారు రూ.765 కోట్ల కిరాణా సామగ్రి టెండర్లను ఖరారు చేసింది. అయితే, ఏ విషయాన్ని కూడా సంక్షేమ శాఖల మంత్రులకుగానీ, ఇతర ఉన్నతాధికారులకుగానీ సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణ లున్నాయి. పీఎంయూకు ఎస్సీ గురుకుల సొ సైటీ సెక్రటరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నా.. టెండర్ల వ్యవహారం ముఖ్యనేత సన్నిహితుల కనుసన్నల్లో, సీఎంవోలోని ఓ ఉన్నతాధికారి ఆధ్వర్యంలో నడిచిందని ప్రచారం జరుగుతున్నది. దీంతో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రగిలిపోతున్నట్టు స మాచారం.ఈ క్రమంలో టెండర్ల సమాచారం ఇవ్వాలని వారిద్దరూ పదే పదే సీఎంవోలో ఒత్తిడి తెచ్చినట్టు సచివాలయ వర్గాలు తెలిపా యి. అయినా, ఇవ్వకపోగా టెండర్ల విషయం లో ఒత్తిడి చేయవద్దంటూ సీఎంవో వర్గాలు మంత్రులకు హుకుం జారీచేసినట్టు ప్రచారం జరుగుతున్నది. కొన్నిరోజుల క్రితం మంత్రు లు, సంక్షేమ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారట. అక్కడ కూడా 'టెండర్ల విషయం పూర్తిగా మేమే చూసుకుం టాం' అంటూ సదరు అధికారి మంత్రుల ముఖంమీదే చెప్పినట్టు తెలిసింది.దీంతో మంత్రులు ఆగ్రహంతో ఊగిపోయి అంతా మీరే చూసుకుంటే ఇక మేమేందుకని అధికారులకు చీవాట్లు పెట్టారని, సమావేశం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారని సచివాలయ వర్గా లు తెలిపాయి. అప్పటి నుంచి ఇద్దరు మంత్రులపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల్లో ప్రతి పనికీ సంబంధించిన సమాచారాన్ని నిఘావర్గాలు ఎప్పటికప్పుడు సేకరిస్తున్నాయని, వెంటనే సీఎంవోకు నివేదికలు అందిస్తున్నాయని పేర్కొన్నాయి. ఈ నివేదికలన్నింటి ఆధారంగా సంక్షేమ మంత్రుల్లో ఒకరి సీటుకు ఎసరు పెట్టేందుకు సీఎంవో వర్గాలు సిద్ధమైనట్టు ప్రచారం జరుగుతున్నది.

మిగతా 2 లో

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

శుక్రవారం, సెప్టెంబర్ 11,2026

www.trinetnews.com

మొదటిపేజీ తరువాయి

### రిపబ్లికన్లను గెలిపిస్తే ఒక్కొక్కరికి 4.75 లక్షలు..

# అమెరికా వయోజనులకు ట్రంప్ ఉచిత హామీ

ఓటర్లకు ఈ వాగ్దానం చేసే హక్కు తనకు మాత్రమే ఉందని ఆయన అన్నారు. విజయవంతమైన కంపెనీలు తమ వాటాదారులకు నగదు పంపిణీ చేసే విధానంతో ఈ చెల్లింపులను ట్రంప్ పోల్చారు. ఈ వాగ్దానాన్ని ఎలా అమలు చేస్తారనే దానిపై ట్రంప్ ఎలాంటి వివరాలు అందించలేదు. కేవలం రిపబ్లికన్లు గెలిస్తే మీరు మాతో గెలిచినట్టే అని మాత్రమే ఆయన పేర్కొన్నారు. వయోజన పౌరులకు ఉద్దేశించిన ఈ చెల్లింపుపై ఉన్న ఏకైక షరతు ఈ చెల్లింపు డబ్బును తప్పనిసరిగా అమెరికాలోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ చెల్లింపును ట్రంప్ డివిడెంట్ అని పిలుస్తారని ఆయన తెలిపారు.

**మధ్యంతర ఎన్నికల తర్వాత యుద్ధానికి ముగింపు**

ప్రపంచమంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అమెరికా-ఇరాన్ యుద్ధం ముగింపుపై యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. నవంబర్‌లో అమెరికాలో జరిగే మధ్యంతర ఎన్నికల తర్వాత యూఎస్-ఇరాన్ యుద్ధం ముగిసే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఇక ఎక్కువ కాలం యుద్ధం కొనసాగించలేదని.. తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిపోయిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ట్రంప్ హయాంలోని ఇంకో రెండేండ్ల పాటు యుద్ధం కొనసాగుతుందని ఆయనకు అత్యంత సన్నిహితులు ఇద్దరు హెచ్చరిస్తున్నట్టు సమాచారం.

మొదటిపేజీ తరువాయి

# ఇందిరమ్మ ఇండ్లకు రూ.5లక్షలు సరిపోవట్లే..

ఇందిరమ్మ ఇండ్ల స్లాబ్ 750 స్కేర్ ఫీట్లు ఉంటే బిల్లు ఆగుతున్నదని, తొలి విడతకు ఈ విషయంలో మినహాయింపు ఇవ్వాలని రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని కొంతమంది ఫోర్‌వీలర్ కొని ట్యాక్సీలు నడుపుకోవడానికి హైదరాబాద్ వచ్చారని ఆయన గుర్తుచేశారు. పలుచోట్ల అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తున్నారని మండిపడ్డారు. లబ్ధిదారుల్లో అనేకమంది పెరిగిన ధరలకు భయపడి ఇంటి నిర్మాణాలు ప్రారంభించడం లేదని, పనులు ప్రారంభించిన వారు భార్యల బంగారం కుదువ పెట్టి, అప్పులు తెచ్చి ఇండ్లు కట్టుకునే దుస్థితి ఉన్నదని చెప్పారు. కొంతమంది అర్హులైన పేదవారికి ఇంటి స్థలాలు లేవని, వారి విషయంలోనూ ప్రభుత్వం ఆలోచించాలని రాజగోపాల్‌రెడ్డి కోరారు.

**మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానమే!**

మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానమేనని, సీఎం రేవంత్‌రెడ్డి కాదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి ఇస్తామని గతంలో అధిష్ఠానం మాట ఇచ్చిందని గుర్తు చేశారు. సీఎం, నేను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరు చూస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో నాకు అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని, మంచి జరిగితే మంచి, చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజం అని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మంత్రి పదవి కోసం రేవంత్‌రెడ్డితో రాజీ చేసుకున్నట్టు కొందరు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కోసం సీఎంను కలిశానని, నియోజకవర్గంలో అభివృద్ధి జరుగాలంటే సీఎం, డిప్యూటీ సీఎంలను కలువాల్సిందేనని చెప్పారు. సీఎంను కలిస్తే కంప్రమైజ్ అని, కలువకపోతే గ్యాప్ పెరిగిందటూ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో నేతల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని తెలిపారు. కొండా సురేఖ విషయంలో సీఎం హర్ట్ అయ్యారని, వీక్ అయితానని అధినాయకత్వంతో చెప్పుకొని ఉంటారని పేర్కొన్నారు. కొండాపై అధిష్ఠానానికి సీఎం చెప్పుకోవడంలో తప్పేమీ లేదని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

**సెక్రటేరియట్‌లో ఏసీబీ దాడులు**

రూ. లక్ష లంచం తీసుకుంటుండగా ఇద్దరి పట్టివేత హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు లంచం తీసుకుంటున్న ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ. 2 లక్షల చెక్కును ఇవ్వడానికి, మిగిలిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌ను ప్రాసెస్ చేయడానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆనందేశి రాఘవేందర్, బషీర్‌బాగ్‌లోని పరిశ్రమ భవన్‌లో ఉన్న టీఎస్ఐడీసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మేది వినోద్ రూ. లక్ష లంచం డిమాండ్ చేశారు. ఫోన్‌పే ద్వారా రూ.5,000 తీసుకున్నారు. సెక్రటేరియట్‌లో బాధితుడి నుంచి గురువారం రూ. లక్ష తీసుకునే క్రమంలో వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు నిందితుల నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు 1వ అదనపు ప్రత్యేక జడ్జి ముందు హాజరుపరిచారు.



# కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం..

## గద్వాల--అయిజ రహదారిపై భారీ ధర్నా

**గద్వాల:ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా అందకపోవడంపై రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న వేళ తరచూ కరెంట్ అంతరాయాలు ఏర్పడటంతో పంటలు నష్టపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ కోతలను నిరసిస్తూ మల్దకల్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. గద్వాల--అయిజ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. వ్యవసాయ మోటార్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.రైతులు రహదారిపై బైఠాయించడంతో గద్వాల--అయిజ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రహదారికి ఇరువైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. రైతుల ఆందోళన కొనసాగుతుండటంతో ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మొదటిపేజీ తరువాయి

# సంధ్యారావు ఎవరో తేల్చండి..

## సైబర్ క్రైమ్‌లో ఆర్ఎస్పీ ఫిర్యాదు!

కేసీఆర్ నివాసానికి దళిత వర్గాల వారు వచ్చి వెళ్లిన తర్వాత ఇంటిని పసుపు నీళ్లతో శుద్ధి చేసుకున్నారంటూ ఈ అకౌంట్ ద్వారా పూర్తిగా నిరాధారమైన, కులవిద్వేషాలను రెచ్చగొట్టే అసత్య పోస్టులు పెట్టారని ఆయన మండిపడ్డారు. ఈ పోస్ట్, హ్యాండిల్ గురించి సీఎం రేవంత్‌రెడ్డి సైతం శాసనసభలో ప్రస్తావించిన తక్షణమే, ఆ అకౌంట్, పోస్టులు పూర్తిగా అదృశ్యం కావడం వెనుక పెద్ద కుట్ర కోణం ఉన్నదని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. నిందితులు ఎవరనేది తేల్చడంతోపాటు, డిజిటల్ ఆధారాలు (ఐపీ లాగ్‌లు, అకౌంట్ డాటా) కనుమరుగైపోకుండా ఎక్స్ సంస్థకు తక్షణమే సమాచారం అందించి ఎఫ్ఐఆర్ న మోదు చేయాలని కోరారు.

**సంధ్యారావు ఎవరో కాదు రేవంత్‌రెడ్డే**

పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం ఆర్ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. సంధ్యారావు ఎవరో కాదు.. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డే అని ఆరోపించారు. ఫేక్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి.. అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని చెప్పారు. సంధ్యారావు అకౌంట్ మహిళ పేరు మాత్రమేనని, ఫొటో కూడా మహిళదే అయినా.. ట్విట్టర్ స్పేస్‌లో మాట్లాడింది మాత్రం పురుషుడని చెప్పారు. ఆ పురుషుడు ఎవరు? ఆ వాయిస్ ఎవరిది? రేవంత్‌రెడ్డిదా? ఆయన అనుచరుల దా? అని ప్రశ్నించారు. ఈ ఫేక్ న్యూస్‌పై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని కోరారు. అసెంబ్లీ వేదికగా సంధ్యారావు అకౌంట్ గురించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని.. ఎవరైనా నిజంగా అవమానంగా భావిం చి, దాడులకు పాల్పడితే ఎవరు బాధ్యులు? అల్లర్లు, కొట్లాటలు సృష్టించే భాష మాట్లాడిన రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. లక్షల ట్విట్టర్ అకౌంట్లు ఉన్నా.. సంధ్యారావు అకౌంటే ఎలా దొరికింది? వేల పోస్టులు ఉన్నా, ఈ పోస్టునే రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎలా చదివారు? అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు వై సతీశ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.క్యాలెండర్‌లు ఎంచుకోండి

మొదటిపేజీ తరువాయి

# ముగ్గురు మంత్రులపై 'ప్రత్యేక' నిఘా..

**అడ్లూరి శాఖపై ప్రత్యేక నిఘా**

గురుకుల టెండర్ల గోల్‌మాల్ వ్యవహారంపై బీఆర్ఎస్ నేతలు నిలదీస్తుండటంతో ఆ శాఖ కు నేతృత్వం వహిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ బదులివ్వలేక సతమతమవుతున్నారు. దీంతో టెండర్లకు సంబంధించిన సమాచారం కోసం ఆయన సీఎంవోపై పదేపదే ఒత్తిడి చేశారని తెలుస్తున్నది. సీఎంవోతో సంబంధం లే కుండానే ఆయన టెండర్ల వ్యవహారంపై అప్ప ట్లో స్పందించారు. టెండర్ విలువ రూ.683.78 కోట్లు మాత్రమే అని, రూ.రెండు వేల కోట్ల కుంభకోణం ఎలా సాధ్యమంటూ బీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు.ఆ తర్వాత టెండర్ల విలువపై మాటమార్చారు. దీనిపై సీఎంవో వర్గాలు ఆయనను తీవ్రంగా మందలించినట్టు తెలుస్తున్నది. టెండర్లపై ఎవరు ఏమన్నా స్పందించవద్దని, వార్త కథనాలను సైతం చూసీచూడనట్టు వదిలేయాలని, అంతా తామే చూసుకుంటామని మంత్రికి అల్టిమేటం జారీచేసినట్టు సచివాలయ వర్గాలు వెల్లడించాయి. ఇలా టెండర్ల వ్యవహారంపై మంత్రి పదే పదే ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేని సీఎంవో వర్గాలు ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. అప్పటినుంచి ఎస్సీ అభివృది ?ధశాఖ, ఎస్సీ గురుకుల సొసైటీలో జరుగుతున్న అక్రమాలు, ఇష్టారీతిన తీసుకుంటున్న నిర్ణయాలపై లోతుగా వివరాలు సేకరిస్తున్నట్టు తెలిసింది. సొసైటీకి సంబంధించిన కీలక స్థానంలో రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న ఓ ఉన్నతాధికారిని కూర్చోబెట్టడం, ఆయన ద్వారా అక్రమ వ్యవహారాలన్నీ కొనసాగిస్తున్నారన్న ఆరోపణలపై సమగ్ర వివరాలు సేకరించి, నివేదిక అందజేసినట్టు సమాచారం.డిప్యుటేషన్లు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైల్స్‌కు సదరు ఉన్నతాధికారి క్లీన్‌చిట్ ఇస్తున్నారని, ఫైలుకో రేటు చొప్పున వసూలు చేస్తున్నారని తేలిందట. దీని వెనుక ఎవరున్నారో నిఘా వర్గాలు నిర్ధారించుకున్నట్టు తెలుస్తున్నది. ప్రొబేషనరీ కూడా పూర్తికాని, ఎస్సీ అభివృద్ధి శాఖకు సంబంధం లేని ఓ మహిళా వార్డెన్‌కు మొదట మంత్రి పేషీలో, ప్రస్తుతం సొసైటీ ప్రధాన కార్యాలయంలో డిప్యుటేషన్ కల్పించారు. సొసైటీ జాయింట్ సెక్రటరీతో సమానంగా ప్రత్యేక గదిని కేటాయించారు. ఆమె ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో ఎవరికీ తెలియదు. ఆమెకు అంత ప్రాధాన్యం ఎందుకు ఇస్తున్నారనే దానిపై సీఎంవో వర్గాలు నివేదిక తెప్పించుకున్నట్టు తెలుస్తున్నది.రాజకీయ వార్తలు చదవండి

**పొన్నం నిర్ణయాలపైనా ఆరా**

గురుకుల టెండర్ల వ్యవహారంపై నిలదీసిన నాటి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సీఎంవో ప్రత్యేక నజర్ వేసినట్టు తెలుస్తున్నది. శాఖకు సంబంధించిన ఉన్నతాధికారి ఒకరు సీఎంవో వర్గాల పైరవీ ద్వారానే నియమితులయ్యారని తెలుస్తున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్ తీసుకునే ప్రతీ సమాచారాన్నీ ఆయన గుట్టుగా సీఎంవోకు చేరవేస్తున్నట్టు చర్చ కొనసాగుతున్నది. బీసీ సంక్షేమ శాఖలో ఇటీవల నిర్వహించిన ఉన్నతస్థాయి ప్రమోషన్లలో భారీగా అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. సీటు కో రేటు చొప్పున పోస్టింగ్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని చెప్తున్నారు.ఈ వ్యవహారంపై నిఘా వర్గాలు లోతుగా సమాచారాన్ని సేకరిస్తున్నట్టు సమాచారం. డిప్యూటీ డైరెక్టర్ పోస్టులతోపాటు ఇటీవల కల్పించిన పలు పోస్టింగ్‌లు, డిప్యూటేషన్లపై ఆరా తీసినట్టు తెలుస్తున్నది. మరోవైపు కుట్టుమిషన్ల పంపిణీకి సం బంధించి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేయాల్సి ఉన్నది. ఇందుకోసం 1.19 లక్షల మిషన్లను కొనుగోలు చేయాల్సి ఉన్నది. దీనికి సంబంధించిన ప్రొక్యూర్‌మెంట్, నీరాకేఫ్, నందనం రీ టెండర్లపై మంత్రి ఇటీవల ప్రత్యేక సమీక్ష ని ర్వహించారు. ఉన్నతాధికారులకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీచేశారు. వీటిపై కూడా నిఘా వర్గాలు వివరాలు సేకరించి, ని వేదిక సమర్పించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

**మంత్రి ఉత్తమ్ కదలికలపై కన్ను**

కాంగ్రెస్ పాలనపై అసంతృప్తిగా ఉన్న ముఖ్యనేతల్లో సివిల్ సైప్లెస్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒకరు. ముఖ్యనేతకు, ఆయనకు మధ్య విభేదాలున్నాయనేది బహిరంగ రహస్యం. ఉత్తమ్ శాఖలపై మొదటినుంచీ ప్రత్యేక నిఘా పెట్టినట్టు ప్రచారంలో ఉన్నది. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల్లో ప్రతి అంశంపై నిఘా విభాగం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ము ఖ్యంగా పౌరసరఫరాలపై నిఘాపెట్టార ని, అందుకే మంత్రికి వ్యతిరేకంగా తమ అనుకూల వ్యక్తిని కమిషనర్‌గా ని యమించారనే చర్చ ఉన్నది. ధాన్యం టెండర్లలో భారీ అవినీతి జరిగిందని ప్రతిపక్ష బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ముఖ్యనేత వర్గం ఆధారా లు సేకరించి అధిష్ఠానానికి పంపినట్టు ప్రచారం జరిగింది. గన్నీ సంచుల కొనుగోళ్లు, రైస్ మిల్లులకు సీఎమ్మార్ కేటాయింపు, ధాన్యం కొనుగోళ్లలో ట్రాన్స్‌పో ర్ట్ టెండర్లు, రేషన్ బియ్యం సరఫరా కోసం నిర్వహించిన స్టేజ్-1 ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు ఇలా ఆర్థిక వ్యవహారాలతో కూడిన అంశాలపై ఆరా తీసి, నివేదికలు సమర్పిస్తున్నట్టు సమాచారం.

# 60 రోజుల గడువుకు చెల్లు!




## ఉద్యోగం కోల్పోతే దేశం వీడాల్సిందే
## అమెరికా డీహెచ్ఎస్ ప్రతిపాదన
## విదేశీ ఉద్యోగులపై ట్రంప్ పిడుగు
## భారత ఉద్యోగులపై తీవ్ర ప్రభావం

**వాషింగ్టన్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

విదేశీ ఉద్యోగులపై ట్రంప్ సర్కార్ మరో పిడుగు వేసింది. ఉపాధి ముగిసిన తర్వాత హెచ్1బీ, ఎల్1 వీసాదారులు వంటి నిర్దిష్ట వలసేతర ఉద్యోగులకు(నాన్ ఇమిగ్రెంట్) ప్రస్తుతం లభిస్తున్న 60 రోజులు అదనపు గడువును రద్దు చేసేందుకు సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనను అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) గురువారం విడుదల చేసింది. అంటే ఇకపై ఉద్యోగం కోల్పోతే దేశం వీడాల్సిందే.ఈ ప్రతిపాదన ఉపాధి ఆధారిత నాన్-ఇమిగ్రెంట్ వీసా విభాగాలకు సంబంధించిన అనేక అంశాలను స్పృశిస్తున్నప్పటికీ భారతీయ ప్రవాస సమాజం దృష్ట్యా చూస్తే దీని ప్రభావం ప్రధానంగా హెచ్1బీ, ఎల్1, ఓ1 వీసాదారులపై (అసాధారణ ప్రతిభకు గుర్తింపు పొందిన వారు) ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉద్యోగం కోల్పోయిన అర్హత గల హెచ్1బీ ఉద్యోగులు వరుసగా 60 రోజుల వరకు లేదా వారి అధీకృత నివాసం ముగిసే వరకు, ఏది ముందుగా వస్తే దాని వరకు విచక్షణాపరమైన గడువును పొందవచ్చు. ఈ కాలంలో వారు మరొక స్పాన్సరింగ్ యజమాని కోసం వెతుకవచ్చు. హోదా మార్పు కోరవచ్చు. లేదా అమెరికాను విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు. అయితే హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఈ 60 రోజుల గడువును తొలగించాలని తాజాగా ప్రతిపాదిస్తున్నది. ఇది భారత విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనున్నది.

**సర్వం వదులుకొని స్వదేశానికి పయనం!**

వలసలపై ట్రంప్ యంత్రాంగం చేపట్టిన కఠిన చర్యలు, హెచ్-1బీ వీసాలకు సంబంధించి నెలకొన్న అనిశ్చితి అమెరికాలోని కొందరు భారతీయ సాంకేతిక నిపుణులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. టెక్సాస్‌లోని సెలీనా మెలిస్సా, డాలస్ సమీప శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పదికి పైగా హెచ్1బీ వీసా కలిగిన కుటుంబాలు తమ ఉద్యోగాలను కోల్పోయి, ఇండ్లు, కార్లు, ఇతర సామగ్రిని అక్కడే వదిలేసి భారత్‌కు తిరిగి వెళ్లిపోయాయని సోషల్ మీడియాలో ఒక పోస్టు వైరల్ అవుతున్నది. ఉద్యోగాలు కోల్పోయిన తర్వాత కొన్ని భారతీయ కుటుంబాలు గృహ రుణ వాయిదాలను, ఆస్తి పన్నులను చెల్లించలేకపోయాయి. ఆస్తి విలువలు పడిపోవడంతో మరి కొందరు తమ ఇండ్లను అమ్మడానికి ఇబ్బందులు పడ్డారని సమాచారం. భారత్ తిరిగి వెళ్లిపోవాలని నిర్ణయించుకునే ముందు అందులో కొన్ని కుటుంబాలు చాలా ఏండ్లపాటు అమెరికాలో నివసించాయని ఆ పోస్టు పేర్కొంది.

**మా దేశాన్ని వదిలిపోండి**

భారత సంతతికి చెందిన ట్రక్‌డ్రైవర్లపై ట్రంప్ యంత్రాంగం మరోసారి విషం కక్కింది. జాతివివక్షను ప్రేరేపించేలా భారత సంతతి వారిని కించపరుస్తూ అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ విడుదల చేసిన ఒక ఏఐ పోస్టర్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారత సంతతికి చెందిన ట్రక్ డ్రైవర్‌ను లక్ష్యంగా చేసుకుని ఏఐ ఆధారితంగా రూపొందించిన 'ట్రాన్స్‌ఫ్రార్మర్ సినిమా' తరహా పోస్టర్ తీవ్ర వ్యతిరేతను ఎదుర్కొంటున్నది. బుధవారం డీహెచ్ఎస్ ఎక్స్ ఖాతాలో ఉంచిన ఈ పోస్టర్‌కు 'ట్రాన్స్‌ఫార్మర్స్: బహిష్కరణల యుగం' అని టైటిల్ పెట్టింది. అందులో డీహెచ్ఎస్ చిహ్నం ధరించి ఉన్న ఒక పెద్ద ట్రాన్స్‌ఫార్మర్, తలపాగా ధరించిన ఒక సిక్కు వ్యక్తివైపు చూస్తున్నాడు. 'మిస్టర్ సింగ్.. అమెరికా దేశం అమెరికన్లకే.. మీకు ఎలా డ్రైవ్ చేయాలో తెలియదు. మా రోడ్లు వదిలిపోండి' అని పేర్కొనడమే కాక, ప్రజలు స్వచ్ఛందంగా తమ దేశాన్ని వదిలిపోవాలని స్పష్టం చేసింది.

# బ్రదర్స్ కోసమే రేవంత్ ఫ్యూచర్ సిటీ..

### అనుముల సోదరులకు అప్పనంగా దోచిపెడ్తున్న సర్కార్




**క్షుద్ర రాజకీయాలు, డైవర్షన్ డ్రామాలతో అసెంబ్లీ సమావేశాలను దారిమళ్లించేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ సర్కార్ ఆయువుపట్టుపై కొట్టింది బీఆర్ఎస్. సీఎం రేవంత్ సోదరుడి కంపెనీ టెస్సెరాక్ట్‌కు ప్రభుత్వం కేటాయించిన రూ.200 కోట్ల విలువైన భూమిని కేటీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ బృందం గురువారం పరిశీలించింది. ఫార్మా భూముల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ డొల్లతనాన్ని బద్దలు కొట్టింది. మిథ్యానగరిలో పెట్టుబడులు పెట్టి ముున్ముందు మోసపోవద్దని హెచ్చరించింది.**

**రంగారెడ్డి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11 :**

ఫ్యూచర్‌సిటీ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.కోట్లు విలువజేసే భూములను వారి సోదరులకు అప్పనంగా పంచిపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పరిశ్రమల పేరుతో ప్రభుత్వం సేకరిస్తున్న భూములను కొల్లగొట్టేందుకు అడ్రస్ లేని కంపెనీలను సృష్టించి వాటి పేర్లమీద కాజేస్తున్నారని మండిపడ్డారు. కొండల్‌రెడ్డికి చెందిన టెస్సెరాక్ట్ అనే కంపెనీకి రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో ఐదెకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని, ప్రస్తుతం మార్కెట్‌లో ఆ భూమి విలువ సుమారు రూ.200కోట్ల దాకా ఉంటుందని పేర్కొన్నారు. భూ బదలాయింపుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సమీపంలోని ఫ్యూచర్‌సిటీలో సీఎం సోదరుడు కొండల్‌రెడ్డికి అక్రమంగా కేటాయించిన భూమిని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్, హరీశ్‌రావు పరిశీలించారు. తుక్కుగూడ ఓఆర్ఆర్ నుంచి కొండల్‌రెడ్డికి కేటాయించిన భూమి వరకు వందలాది కార్లు, బైకులతో ర్యాలీగా వారు అక్కడికి చేరుకున్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బాగుపడింది కేవలం సీఎం సోదరులేనని ఎవరైనా చెప్తారని విమర్శించారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136